ఇంటర్వ్యూలకి వెళ్ళడమంటే విసుగు పుట్టి పోయింది. అవి కర్మకాండల్లాంటివని, ఓ తంతు లాంటివని అర్థమైపోయింది.

ఆడపిల్లల పెళ్ళిచూపులకి, ఈ ఉద్యోగాల ఇంటర్వ్యూలకు దగ్గర సంబంధముందేమో ననిపిస్తుంది. మధ్యతరగతి ఆడపిల్ల తల్లిదండ్రులు ఎవర్ని పెళ్ళిచూపులకు పిలిస్తే వాళ్ళ ముందు తలవంచు క్కూర్చోవాలి. వాడు తనను నచ్చి తినేటట్లు చూస్తూ వెళ్ళిపోయి, ఆనక ఏ కట్నమో నచ్చక మీ సంబంధం వద్దనే వరకు అతడిని భర్తగా ఊహించుకుంటూ ఎన్ని కలలో! అలాగే ఏ ఇంటర్వ్యూ కాల్ వచ్చినా, ఆ ఉద్యోగంలో చేరిపోయినట్లు, ప్రమోషన్ మీద ప్రమోషన్ కొట్టేసి పెద్దవాడై పోయినట్లు తనలాంటి వాడికెన్ని కలలు!




ఆ కలలన్నీ కల్లలనే విషయం ఆ కన్య కర్థమైనట్లే ఈ నిరుద్యోగికి అర్థమైపోతుంది. ఆ వచ్చే వాడికి తను నచ్చినా తన తండ్రిచ్చే కట్నం నచ్చదు, తనకిక పెళ్ళి కాదని నిర్ధారించుకునీ పెద్దవాళ్ళ మాట కాదనలేక పెళ్ళిచూపులకు సిద్ధమయ్యే ఆడపిల్లలా —ఎలాగూ ఈ ఉద్యోగం నాకు రాదని తెలిసినా పెద్దవాళ్ళ ఆశల్ని నిలువునా కూల్చేయలేక రాని ఉద్యోగాలకి, ఇంటర్వ్యూలకి వెళ్ళడం నా కలవాటై పోయింది.

ఇది నా వందో ఇంటర్వ్యూ—

ఇదే ఆఖరి ఇంటర్వ్యూ.

ఈసారి ఉద్యోగం రాదని తెలిస్తే తిరిగి ఇంటికి రాకూడదని, వచ్చి ఇంట్లో వాళ్ళకి నా దౌర్భాగ్యపు ముఖాన్ని చూపించకూడదని —ఒక స్థిర నిశ్చయాని కొచ్చి ఇంటర్వ్యూకి బయల్దేరాను.

ఉద్యోగం రాని వాడికి, చచ్చేవాడికి ఈ బస్సు ఖర్చులు కూడా దండగెందుకు?

నడుచుకుంటూ బయల్దేరాను.

రకరకాల ఆలోచనలు మనసుని ముసురుతున్నాయి.

ఇవాళ ఇలా జీవంతో ఉన్నాను. రేపు నిర్జీవంగా ట్యాంక్‌బండ్‌లో తేలితేనన్నా నా మీద ఎవరికైనా జాలి కలుగుతుందా? నిరుద్యోగిగా అందరి నిరాదరణ తప్ప మరేమీ నోచుకోని నాకు ఇలాంటి ఆలోచనలు తప్ప మరే ఆలోచనలు వస్తాయి!

ట్యాంక్‌బండ్ దగ్గర నా శవం చుట్టూ చేరి ఎవరెవరు ఎలాంటి కామెంట్స్ చేస్తారో ఊహించుకుంటూ నడుస్తున్నాను.

"బాబూ... ధర్మం..." ఈ మాటల్తో ఆలోచనల్లోంచి బయటికొచ్చాను.

ఎదురుగా ఓ కుష్ఠు వ్యక్తి!

అడుక్కుంటున్నాడు "బాబూ... ధర్మం" అంటూ.

శరీరంలో అన్ని అవయవాలు ఉన్న నేనే బతకలేక చావాలనుకుంటుంటే ఇలా వేళ్ళు కొరుక్కుపోయినా బతకాలని పాకులాడే అతణ్ణి చూసేసరికి అసహ్యం వేసింది.

"అవతలికి ఫో..." అతడిని తప్పించుకుంటూ ముందుకు నడక సాగించాను.

నాకు రోడ్డు పక్కన ఇలాంటి వాళ్ళు సంసారాలు చేస్తూ కనిపిస్తే చాలా ఆశ్చర్యం, కోపం కూడా కలుగుతుంది. వీళ్ళ బతుకులకే ఠికాణా లేకపోతే వీళ్ళు మరి కొందరికి ఎందుకు బతుకులిస్తారో? ఇది నాకు అర్థం కాని ప్రశ్న.

ఇలాంటి రకరకాల అర్థం కాని ప్రశ్నలతో బుర్ర పాడు చేసుకుంటూ ఇంటర్వ్యూ స్థలాన్ని చేరుకున్నాను.

మామూలే...

అక్కడో క్యూ... మూడు గంటలు వృథా... మొక్కుబడి ప్రశ్నలు... మొండిచెయ్యి...

అనుకున్నంతా అయింది.

ఈ ఉద్యోగమూ నాకు రాదు!

ఇక ఇంటికి వెళ్ళలేను. నా ముఖాన్ని ఎవ్వరికీ చూపించలేను.

రాత్రి పడే వరకూ జంట నగరాల వీధులన్నీ సర్వే చేశాను.

లోకాన్నంతటినీ చీకటి కమ్మేసింది. నా మనసుని, బతుకుని ఎప్పుడో కమ్మేసింది. అందుకే నాకు చీకటంటే భయంలేదు...

లోకం ఎంత విచిత్రం! ఉద్యోగం రాక ఒకడు ఏడుపు ముఖంతో వెనుదిరిగితే, మరొకడు ఆనందంతో గెంతుకుంటూ ఉద్యోగంలోకి వస్తాడు. ఈ ట్యాంక్‌బండ్ వాతావరణం కూడా నా కలాగే అనిపించింది. ఉద్యోగం రాదని ఆత్మహత్య చేసుకోవడానికి నే నిక్కడికి వస్తే, చాలామంది పెళ్ళాం పిల్లలతో సరదాగా గడపడానికి ఇక్కడికి వచ్చారు!

వీళ్ళందరూ వెళ్ళిపోయేంత వరకూ ఏ బెంచీ మీదో కూలబడి దోమలకన్నా చురుక్కుమనిపించే ఆలోచనలతో బాధపడాలి. తప్పదు!

ఓ బెంచి మీద కూర్చున్నాను.

ఎదురుగా దంపతులు... ముచ్చటగా వాళ్ళకో బిడ్డ... వాడు ఆడుకుంటుంటే వీళ్ళు ఆనందపడుతున్నారు!

'ఆనందపడండి ఆనందమంతా ఇప్పుడే పడండి... రేపు వాడు పెద్దవాడై నాకులా ఏ ఉద్యోగం రాక చస్తే ఏడ్వొద్దూ... పడండి... ఆనందపడండి ...' నా ఆలోచనలు నాకే విచిత్రంగా అనిపించాయి.

చుట్టూ చీకట్లని పారద్రోలడానికి దీపాలున్నాయి. కానీ నా మనసులో ఎక్కడా చిన్న ఆశాదీపం కూడా లేదు...

అందరికీ భిన్నంగా నేను...

నిముషాలు గంటలుగా... మారుతున్నాయి.

పదై ఉంటుందేమో!

చాలామంది వెళ్ళిపోయారు. అక్కడక్కడా తప్ప మనుషులు లేరు...

చావంటే భయంలేదు నాకు. కానీ మనసుని ముసిరే ఆలోచనలు విపరీతంగా భయపెట్టసాగాయి —

ఇంకా వీటిని తట్టుకోలేను. బెంచ్ మీద నుంచి లేచి నీళ్ళలోకి దూకబోయాను.

వెనుకనుంచి ఎవరో లాగినట్లయింది.

అటు తిరిగాను.

ప్రొద్దున చూసిన కుష్ఠు బిచ్చగాడు!

ఉలిక్కిపడ్డాను.

"ఎందుకు బాబు అలా ఉలిక్కిపడ్డావ్? కుష్ఠువాడు తాకాడనా? నువ్వా నీళ్ళలోకి దూకితే నీ శరీరాన్ని చేపలే తింటాయో, కప్పలే కరుస్తాయో... నీ కెందుకు బాబూ ఆ ఉలుకు!"

నిజమే! నీళ్ళలోకి దూకితే ఈ శరీరం చీకిపోదూ... అందుకు సిద్ధమైన నేను ఇతను తాకగానే ఇంత తత్తరపడ్డానెందుకు?

"బాబూ! నన్ను చూడు... వేళ్ళు సగం పోయాయి. ఎప్పుడు రాలిపోతానో నాకే తెలీదు. అయినా బతకాలని ఆశ... ఏమేమో చేయాలనే ఆశ! అందరూ ఉండి, అన్ని అవయవాలు బాగా ఉన్న నువ్వు ప్రాణం తీసుకోవాలనుకోవడంలో అర్థముందా? పోయే ప్రాణాన్ని ఎవ్వరూ ఆపలేరు. కానీ ఉన్న ప్రాణాన్ని నిలువునా తీసేయాలనుకోవడం న్యాయమా బాబూ? నిన్ను పెంచి ఇవాళో రేపో చేతికందివస్తావనుకుంటున్న నీ వాళ్ళకి కడుపు చిచ్చు పెడతావా?"

ఇంతకు ముందు ఆ కుష్ఠు అతణ్ణి చూస్తే విపరీతమైన అసహ్యం వేసింది. కానీ ఇప్పుడు నన్ను చూస్తే నాకే విపరీతంగా అసహ్యం వేస్తోంది.

...నిజమే! చూసే కన్నుండాలే కాని ఎన్నో విషయాల్ని చూడవచ్చు. హృదయం తెరచుకుని ఉండాలే కాని ఎన్నో విషయాల్ని, ఎవరెవరి దగ్గర నుంచో నేర్చుకోవచ్చు... జీవితంలో ప్రతి ఒక్కళ్ళూ మనకు, ఏదో ఒక సమయంలో గురువులే!

కనువిప్పయినట్టనిపించింది.

"లేదండి... నేను చావాలనుకోవడం లేదు. రిక్షా తొక్కైనా నా వాళ్ళని పోషించుకుంటాను!" అతడికేసి రెండు చేతులూ జోడించి వెనుదిరిగాను...

ఈ శరీరం నాది కావచ్చు, కాని ఈ జీవితం నాది కాదు! జన్మ నిచ్చిన వాళ్ళది కూడా! ఎవరో ఏదో ఉద్యోగం ఇస్తే చెయ్యాలని పాకులాడడం కన్నా నాకుగా నేనే ఏమి చేయగలిగినా చేసి బతుకుతాను. కాదు నా వాళ్ళనీ బతికిస్తాను.

స్థిర నిశ్చయంతో వెనుదిరిగాను.

ఇప్పుడు నాకు ఆ కుష్ఠు వ్యక్తి గుర్తుకొస్తే తెగిన అతడి చేతివేళ్ళు, కాలివేళ్ళు గుర్తుకొచ్చి ఒళ్ళు జలదరించడం లేదు —చస్తూ కూడా బతకాలనే ఆశని నాలో రేపిన పవిత్రాత్మగా అనిపిస్తున్నాడు! అతడికి వేళ్ళు తెగవచ్చు, నాకు మనసే కుళ్ళిపోయింది... నా కన్నా అతను ఎంతో ఆరోగ్యవంతుడు! అతనే వెలుగులా కనిపించాడు. ●

## మోహన్‌బాబు ఏ పార్టీ?



ఎక్కడ ఏ సెట్లో ఉన్నా హడావుడి సృష్టించే మోహన్‌బాబు ఈసారి 'తెరవెనుక' ఉండిపోయారెందుకు?

స్వంత చిత్రాన్ని ప్రారంభిస్తానని ప్రకటించి ఆ కథా చర్చలలో ఉన్న మోహన్‌బాబు ఈసారి రాజకీయాలలో చురుకైన పాత్ర నిర్వహించడం లేదు సరికదా, ఒక్క ప్రకటనైనా ఇవ్వకపోవడం గమనార్హం.

తన గురువు దాసరి నిర్మించే 'పిచ్చోడి చేతిలో రాయి' చిత్రంలో మోహన్‌బాబు కూడా నటించవచ్చునన్న వార్తలు వచ్చాయి. అయితే అలాంటి చిత్రాలలో తాను నటించనని ప్రకటించాడు మోహన్‌బాబు. ప్రస్తుతం మోహన్‌బాబు ఏ పార్టీలో ఉన్నట్టు?

